ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 28 మే 2025



జిల్లాలో భారీ వర్షం..



కొడిమ్యాల : సూరంపేట వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వాగు నీరు

- కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో గంటన్నర వ్యవధిలో 101 మిల్లీమీటర్ల వర్షం
- జలమయమైన రహదారులు
- కుంటలు, చెరువుల్లోకి నీరు

8

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం అసోసియేషన్ తరపునిన ముద్రించిన పుస్తకాలను సంఘం సభ్యులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్ రావు, పిసి హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించాలి

జగిత్యాల అగ్రికల్చర్, మే27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. పండిత పరిషత్తు జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నందున స్థానిక ధరూర్‌క్యాంప్ జడ్పీహెచ్ పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. సంఘబాధ్యులు నరేందర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నెహ్రూకు ఘన నివాళి

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద స్వాతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మంగళవారం అధికారులు నిర్వహించారు. 1963 సంవత్సరంలో పోచంపాడ్ వద్ద నెహ్రూ డ్యామ్ నిర్మాణానికి పునాది రాయి వేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్‌పీ డీఎస్ఈ లాల్‌సింగ్, సూపరింటెండెంట్లుగోదావరి, రవీందర్, ఎస్ఆర్ఎస్‌పీ టీఎన్‌జీవో అధ్యక్షుడు ప్రవీణ్ రాజ్, నాయకులు నరేందర్, ఏఈఈ శ్యామ్ పాల్గొన్నారు.



పంచాయతీలకు నిలిచిన నిధులు

- పాలక వర్గాలు లేక విడుదల చేయని కేంద్ర ప్రభుత్వం
- ప్రత్యేకాధికారుల పాలనలో కుంటుపడిన అభివృద్ధి
- పారిశుధ్య కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఇక్కట్లు

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు, మండల, జిల్లాపరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను నిలిపి వేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు నిధులు ఇచ్చే పరిస్థితిలో లేకపోవడంతో గడిచిన 15నెలలుగా పల్లెల్లోపాలన అస్తవ్యస్తంగా మారింది. జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. గ్రామపంచాయతీ కార్యదర్శులు అప్పులుచేసి మరి అత్యవసర పనులు చేయిస్తున్నారు. 2024 ఫిబ్రవరితో గ్రామ పంచా యతీల్లో పాలక వర్గాల పదవీ కాలం పూర్తయ్యింది. వెంటనే ఎన్నికల నిర్వహణ చేపట్టాల్సి ఉండగా కొత్త గా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన పెట్టింది. ఏడాదిన్నర కావస్తున్నా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎలాంటి అడుగులు పడటం లేదు. ఇక మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల కాల పరిమితి కూడా 2024 జులై 5వ తేదీతో ముగిసింది. దీంతో పరిషత్ ఎన్నికల నిర్వహణ లేకపోవడంతో వాటిలోనూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.

● ఆర్థిక సంఘం నిధుల ఖర్చు ఇలా...

స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామాల జనాభాను బట్టి ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంది. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం ఇచ్చే గ్రాంట్‌ని అందులో కలిపి ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధుల విడుదలని నిలిపి వేసింది. కేంద్రం నుంచి జిల్లాకు వచ్చే మొత్తం నిధుల్లో 5శాతం జిల్లాపరిషత్‌కు, 10శాతం మండల పరిషత్‌లకు, 85శాతం గ్రామపంచాయతీలకు కేటాయిస్తారు. దీంతో ఆయా పాలకవర్గాల్లోని ప్రజా ప్రతినిధులు వారి పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉండేది. ఆ వచ్చిన నిధుల్లోనే 6శాతం కార్యాలయాల నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంచాయతీల్లో విద్యుత్, నెట్ బిల్లులు, వాహనాల అద్దె చెల్లింపు, ఇతర ఖర్చులకు వినియో గించేవారు. కేంద్రం నిధులు నిలిపివేయడంతో ఇప్పుడు ఈ చెల్లింపులన్నీ నిలిచిపోయాయి.

● అప్పుల్లో కార్యదర్శులు..

వర్షాకాలంలో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనడానికి కూడా డబ్బులులేవు. ప్రతీ నెల విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు, వీధి దీపాల నిర్వహణ తదితర పనుల కోసం అప్పులు చేయాల్సి వచ్చిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు వస్తాయనే ఆశతో కార్యదర్శులు అప్పులు తీసుకువచ్చి మరీ పనులు చేయిస్తున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇటు బిల్లులు రాక అటు వడ్డీలు పెరిగి అప్పుల పాలవుతున్నారు. మండల పరిషత్తులకు సంబంధించి రెండేళ్ల నుంచి ఎంపీడీవోల వాహనాలకు అద్దె చెల్లింపులు, ఇంటర్నెట్ బిల్లులు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా పరిషత్‌లో నిల్వ ఉన్న ఫండ్ నుంచి కార్యాలయం నిర్వహణ...

మిగతా 8లో

అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో కీటక జనిత, సీజనల్ వ్యాధులపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు ప్రతి రోజు డ్రైడే పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిలువలు తొలగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల నియంత్రణకు అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీపీఓ మదన్ మోహన్, డీఎంహెచ్‌ఓ ప్రమోద్ కుమార్, జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ఎన్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్యాధికారులు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.8 కోట్లు మంజూరు

మెట్‌పల్లిటౌన్, మే27 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణానికి 6 కోట్ల 80 లక్షల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టు కున్నామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నిధులను మంజూరు చేసిన రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

వెల్గటూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్, 5ఎస్ అమలు చేసిన తీరు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీల గురించి అడిగి తెలుసుకున్నారు. .రికార్డుల గదిని, రైటర్ గదితో పాటు అన్ని విభాగాలను తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్సైని ఆదేశించారు. సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై ప్రజలకు ముఖ్యంగా యువతకు వివరించి సైబర్ నేరాల బారిన పడకుండా వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శిస్తూ, ప్రజలతో సత్సంబంధాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. పాత నేరస్థులపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను యాక్సిడెంట్ జోన్లుగా, బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని సూచించారు. నిరంతరం గస్తీ నిర్వహించాలని అన్నారు. రికార్డులు క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చంధర్, ఎస్సై ఉమాసాగర్, అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఈ శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

జగిత్యాల అగ్రికల్చర్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫుడ్ డెలివరీ, హోమ్ సర్వీసెస్, కొరియర్ సర్వీసెస్, ఏసీ టెక్నీషియన్స్ గ్రాఫిక్ డిజైనర్స్ వీడియో ఎడిటర్స్ ఉబర్, ఓలా, రాపిడో, స్విగ్గి, జోమాటో, జెప్టో, అర్బన్, కంపెనీ మొదలైన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంలో పనిచేసేవారు తప్పనిసరిగా ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ సురేంద్రకుమార్ కోరారు. తమ పేరు నమోదు చేసుకున్న కార్మికులు ప్రభుత్వం అమలు చేసే సాంఘిక సంక్షేమ పథకాలు వీరికి వర్తిస్తాయన్నారు. దీనికి గానూ మొబైల్‌నెంబర్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ద్వారా సొంతంగా గానీ, సీఎస్‌సీ సెంటర్‌లలో గానీ, తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఉచిత పశు వైద్యశిబిరం

సారంగాపూర్, మే, 27 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రంగపేట గ్రామంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ మాట్లాడుతూ పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ డుగు రవి, ఉనుగు జోగిరెడ్డి పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం'

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): యువకులకు, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. హైదరాబాద్‌లో సేవాదళ్ సెక్రెటరీ బోగోజీ ముఖేష్‌ఖన్నా ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ సొసైటీ పేరిట ఏర్పాటు చేసిన పోస్టర్లను రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. యువకులు ఉన్నత విద్యను అభ్యసించి, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డ్రగ్ ఫ్రీ సొసైటీ పేర కార్యక్రమాలు చేపడుతున్న సేవాదళ్ కాంగ్రెస్ కార్యదర్శి ముఖేష్ ఖన్నాను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు బండి సురేందర్, దయాకర్, రాజేష్, ఫయాజ్, ఫశీ, షమీ, వసంత తదితరులున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్

జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీ

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మపురి తహసీల్దార్ క్రిష్ణచైతన్యను కోరుట్ల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ధర్మపురి తహసీల్దార్‌గా ఇటీవల నిజామాబాద్ నుంచి బదిలీపై వచ్చిన నాగార్జునను నియమించారు. మల్యాల తహసీల్దార్ మునీందర్‌ను మేడిపల్లి తహసీల్దార్‌గా, మల్యాల తహసీల్దార్‌గా కెవసంతను బదిలీ చేశారు.

బీర్‌పూర్ తహసీల్దార్ పోస్టులో ప్రస్తుతం కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సుజాతను బదిలీ చేశారు. కొడిమ్యాల తహసీల్దార్ రమేశ్‌ను మల్లాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొడిమ్యాలలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కిరణ్ కుమార్‌ను బదిలీపై వెళ్లిన తహసీల్దార్ రమేశ్ స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. సివిల్ సప్లయి కార్పొరేషన్‌లో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బీఎస్ఎస్ వర ప్రసాద్‌ను ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

నాయబ్ తహసీల్దార్ల బదిలీ

బీమారం నాయబ్ తహసీల్దార్‌గా కె పద్మ, వెల్గటూరు హరీశ్ కుమార్, కోరుట్ల ఆర్‌డీఓ కార్యాలయం నాయబ్ తహసీల్దార్‌గా రాజ్ మహ్మద్, మెట్‌పల్లి నాయబ్ తహసీల్దార్‌గా అబ్దుల్ ఖదీర్ బదిలీ అయ్యారు. జగిత్యాల సివిల్ సప్లయి నాయబ్ తహసీల్దార్‌గా ఉమాపతి, జగిత్యాల ఆర్‌డీఓ కార్యాలయ నాయబ్ తహసీల్దార్‌గా శ్రీకాంత్, బుగ్గారం అచ్యుత్‌రెడ్డి, మెట్‌పల్లి సివిల్‌సప్లయి నాయబ్ తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్, మల్యాల సివిల్ సప్లయి నాయబ్ తహసీల్దార్‌గా విష్ణు, జగిత్యాల రూరల్ నాయబ్ తహసీల్దార్‌గా అరుణ్‌కుమార్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రమాదవశాత్తూ బావిలో పడి యువతి మృతి


అశ్విత (ఫైల్)

మానకొండూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కెల్లేడు శివారు గ్రామమైన కందులపల్లిలో ఓ యువతి ప్రమాదవశాత్తు చేద బావిలో పడి మృతి చెందింది. కందులపల్లికి చెందిన కందుల స్వప్న-ముత్తయ్య దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమార్తె అశ్విత, కుమారుడు రాజు ఉన్నారు. మంగళవారం స్వప్న, ముత్తయ్య గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులకు వెళ్లారు. ఇంటిలో ఉన్న చేద బావిలో నీళ్లు తోడుతున్న అశ్విత(20)ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడింది. ఆమె సోదరుడు రాజు అరవడంతో చుట్టు పక్కల వారు బావిలో దిగి అశ్వితను బయటికి తీయగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలు ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి కౌలు రైతు మృతి


నర్సయ్య (ఫైల్)

ఇల్లంతకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన చీకోటి నర్సయ్య(62) అనే కౌలురైతు ట్రాక్టర్ కిందపడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్య వంతడుపుల గ్రామ సమీపంలో భూమి కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంటవేశాడు. మంగళవారం మొక్కజొన్న కంకులను ట్రాక్టర్‌లో తీసువచ్చి కుప్పపోసి తిరిగి ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చొని వెళుతున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా వాహనం నడుపడంతో కిందపడ్డాడు. నర్సయ్యపై ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లచ్చవ్వతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఫసియొద్దీన్ తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హరీశ్‌రావు కాలనీకి చెందిన కిమ్మసారం సురేశ్ అనే నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన అన్నల్‌దాస్ శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి సొంత గ్రామానికి వెళ్లాడు. జనవరి 1, 2021న ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 8గ్రాముల బంగారు చైన్, పావు తులం బంగారు ఉంగరం, అయిదు తులాల వెండి చైన్ దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కిమ్మసారపు సురేష్ అనే నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సందీప్ కేసు వాదించారు. కోర్టు మానిటరింగ్ అధికారి శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ. 100 జరిమానా విధించారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ కేసులో..

సిరిసిల్ల క్రైం : దొంగతనం కేసులో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన సిరికొండ నరేశ్ అనే నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని మార్కెట్ ఏరియా లోగల పెద్దమ్మ దేవాలయంలో జనవరి 26, 2020న తెల్లవారు జామున తాళాలు పగులగొట్టి అమ్మవారి మూడు గ్రాముల బంగారు జత కమ్మలు, నాలుగు గ్రాముల బంగారు ముక్కు పుడకను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటనపై దేవాలయం అధ్యక్షుడు రమేశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సిరికొండ నరేశ్ అనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఎస్ఐ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, పీపీ సందీప్ కేసు వాదించారు. కోర్టు మానిటరింగ్ అధికారి శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ. 100 జరిమానా విధించారు.

పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి


లక్ష్మణ్ (ఫైల్)

ఇల్లంతకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ్(25) అనే గొర్లకాపరి పిడుగుపాటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ మంగళవారం గొర్లను రేపాక గ్రామశివారులో మేతకు తీసుకొని వెళ్లాడు. శ్మశానవాటిక సమీపంలో లక్ష్మణ్‌తో పాటు అతని స్నేహితుడు దూరదూరంగా గొర్లను మేపుతుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, కేశవేని శ్రీనివాస్, రామస్వామి, పత్రి అంజయ్యలు మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన నూతన్ ప్రసాద్ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సకాలంలో సాగు చేస్తే.. అధిక దిగుబడి



కూరగాయల పంటలతో రైతులకు ఆదాయం

చొప్పదండి, మే 27 (ఆంధ్రజ్యోతి): అయిదు ఎకరాల్లో వరి పంటతో వచ్చే ఆదాయం ఒక్క ఎకరం కూరగాయల సాగుతో వస్తాయి. కూరగాయలు లేని సందర్భాల్లో ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు సరఫరా అవుతాయి. సరైన సమయంలో, వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు పంటల సాగు చేపడితే కూరగాయల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కూరగాయల సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తుంది. ఈ నేపథ్యంలో కూరగాయల సాగు కోసం ప్రత్యేక క్యాలెండర్‌ను అధికారులు రైతుల కోసం రూపొందించగా, ఏ నేలలో ఏ కూరగాయలు సాగు చేపట్టాలో రైతుల కోసం సమగ్ర సమాచారం.

జూన్, జూలై నెలల్లో టమాట, వంకాయ, మిర్చి, బెండ, సోరకాయ, కాకరకాయ, బీరకాయ, క్యాబేజీ సాగు ప్రారంభించాలి. ఆగస్టులో ముల్లంగి, క్యారెట్, ఆలుగడ్డ, బఠాణి, సోరకాయ, ఉల్లిగడ్డ, కొత్తి మీర, సెప్టెంబరులో మిరప కాయలు, క్యాలిఫ్లవర్, క్యాబేజి, ముల్లంగి, క్యారెట్ సాగు చేయాలి. అక్టోబరులో టమాట, వంకాయ, మిర్చి, క్యాలిఫ్లవర్, ఉల్లిగడ్డ, ముల్లంగి, కొత్తిమీర, మెంతి, నవంబరులో టమాట, వంకాయ, క్యాబేజి, ఉల్లిగడ్డ, ముల్లంగి, క్యారెట్, ధనియాలు, జీర, మెంతి సాగు ప్రారంభించాలి. డిసెంబరులో కర్భూజ, పుచ్చకాయ, బఠాణి, బెండ, పాలకూర, బీరకాయ విత్తనాలు వేయాలి.

జనవరిలో వంకాయ, మిర్చి, ముల్లంగి, బీన్స్, బెండ, కాకర, గోరుచిక్కుడు, దోస, బీరకాయ సాగు ప్రారంభిస్తే మంచి దిగుబడి వస్తుంది. ఫిబ్రవరిలో క్యాబేజీ, వంకాయ, మిర్చి, టమాట, ముల్లంగి, గుమ్మడి, కాకర, కీరదోస, కర్భూజ, గోరుచిక్కుడు, బీరకాయ సాగు చేయాలి. మార్చిలో బెండ, గుమ్మడి, కాకర, కర్భూజ, ముల్లంగి, బీరకాయ, ఉల్లిగడ్డ, గోరుచిక్కుడు సాగు చేయాలి. ఏప్రిల్ ముల్లంగి, అల్లం, టమాట, బెండ, కీరదోస, మే నెలలో వంకాయ, కాకరకాయ విత్తనాలు వేసుకుంటే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మే, జూన్‌లో బోడకాకరకాయ సాగును రైతులు చేపట్టవచ్చు. అలసంద సంవత్సరంలో ఏ నెలలోనైనా సాగు చేపట్టవచ్చు.

కూరగాయల రైతులకు సబ్సిడీ ఇస్తున్నాం
చింతల రోహిత్, ఉద్యానవన శాఖ అధికారి



కూరగాయలు సాగు చేసే రైతులకు అనేక రకాల సబ్సిడీలను ఉద్యాన శాఖ అందిస్తుంది. మల్చింగ్, డ్రిప్, స్టేకింగ్, పందిరి సాగుకు సబ్సిడీలను అందజేస్తున్నాం. కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నాం. రైతులు సబ్సిడీలను సద్వినియోగించుకోవాలి.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

కోనరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతిచెందాయి. పుష్పలత, రామ్‌రెడ్డిలకు చెందిన రెండు పాడిగేదెలు పొలంలో మేత కోసం తీసుకెళ్లగా విద్యుత్తు వైర్లు తెగి కింద పడి ఉండగా షాక్ తగిలి మృతిచెందాయి. దీంతో బాధిత రైతు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. సెస్ అధికారులు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

పిడుగు పాటుతో..

గంగాధర, మే 27 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కాసారంలో పిడుగుపాటుకు గేదే మృతి చెందింది. గ్రామానికి చెందిన పెద్దిపల్లి తిరుపతికి చెందిన గేదె మంగళవారం ఈదురు గాలులతో కూడి వర్షంలో పిడుగు పడగా అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. రైతును ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు.

యువకుడికి దేహశుద్ధి

చందుర్తి, మే 27 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం అనంతపల్లి గ్రామంలోని బెల్ట్‌షాప్ వద్ద నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడికి దేహశుద్ధి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. అనంతపల్లి గ్రామంలో ఓ యువకుడు బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఇంట్లోకి చొరబడి మద్యం సీసాలు, డబ్బులు చోరీకి యత్నించాడు. యువకుడిని నిర్వాహకులు పట్టుకోగా, గ్రామస్థులు దేహశుద్ధి చేసి, పోలీసులకు సమాచారం అందించారు.

బోరు మోటార్ ధ్వంసం

తంగళ్లపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బాలమల్లుపల్లె శివారులోని రైతు బూరుగుపల్లి మహేష్‌కు చెందిన బోరు మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బోరును ధ్వంసం చేస్తుండగా సమాచారం అందుకుని అక్కడికి వెళ్లగా ద్విచక్ర వాహనాన్ని వదిలేసి పారిపోయినట్లు బాధిత రైతు మహేష్ తెలిపాడు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ధ్వంసమైన బోరును పరిశీలించి, ద్విచక్ర వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గంజాయి పట్టివేత

మెట్‌పల్లిటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం సాయంత్రం పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో పెట్రోలింగ్ చేస్తుండగా అబ్దుల్ సోహెల్ మరో బాలుడు బైక్‌పై కోరుట్ల వైపు నుంచి మెట్‌పల్లి వైపు అనుమానాస్పదంగా వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద నిషేధిత గంజాయి 120 గ్రాములు దొరికినట్లు ఎస్సై తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకుని బైక్‌ను, రెండు మొబైల్ ఫోన్‌లను సీజ్‌చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూవివాదంతో మహిళ హత్య

● నిందితుడితో పాటు ప్రోత్సహించిన తల్లి అరెస్ట్ ● కత్తి, మొబైల్ ఫోన్ స్వాధీనం

సిరిసిల్ల/చందుర్తి మే 27 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల పరిధిలోని మహిళ హత్య కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం ఒక ప్రకటనలో ఎస్పీ వెల్లడించారు. చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ, బొల్లు మనోజ్‌ల మధ్య కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఎలాగైనా మల్లవ్వను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో బొల్లు మనోజ్ తల్లి అయిన మోహినవ్వ అలియాస్ మల్లవ్వ ప్రోత్సాహంతో మనోజ్ మల్లవ్వను హత్య చేశాడు. ఈ నెల 26న సాయంత్రం మల్లవ్వ వ్యవసాయ పనులు పూర్తిచేసుకొని ఇంటికి వెళ్తుండగా దారిలో పెద్దమ్మ గుడి సమీపంలో కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో మనోజ్ మల్లవ్వను హత్య చేశాడు. అనంతరం చందుర్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోగా పోలీసులు మనోజ్, అతని తల్లి మోహినవ్వలపై కేసు నమోదు చేసి వారి నుంచి కత్తి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. గతంలోనూ 2023లో హత్య కేసులో, దొంగతనం, బెదిరింపులకు పాల్పడిన మనోజ్‌ను రెండు కేసుల్లో జువైనల్ హోమ్‌కి, రెండు కేసుల్లో రిమాండ్ చేశారు.


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న చందుర్తి పోలీసులు

సబ్బితం ఎల్లమ్మ ఆలయంలో చోరీ


కెనాల్‌లో పడేసిన హుండీ

పెద్దపల్లి రూరల్ , మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్బితం గ్రామంలో గౌడ సంఘం నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి పుస్తెలు, మెట్టెలు, ముక్కు పుడక, హుండీని ఎత్తు కెళ్లారు. మంగళవారం ఆలయంలో పూజ చేసేందుకు గౌడ సంఘం సభ్యులు రాగా ఆలయం తాళం పగలగొట్టి ఉండటంతో పాటు, హుండీని ఎత్తుకెళ్లి అందులో ఉన్న నగదును తీసుకొని సమీప కాలువలో హుండీ పడేసినట్లు తెలిపారు. బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించినట్లు నాయకులు తెలిపారు.

ఫాజుల్‌నగర్ శివారులో చిరుత సంచారం?


ఫాజుల్‌నగర్ శివారులో చిరుత పాదముద్రలు

వేములవాడ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామ శివారులో చిరుత సంచరిస్తోందన్న సమాచారంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ రైతులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ శివారులో ఉన్న పాదముద్రలను బట్టి చిరుత సంచరిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. గతంలో సైతం ఫాజుల్‌నగర్ గ్రామశివారులో చిరుత సంచరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

జగిత్యాల కోర్టు నుంచి ఖైదీ పరారీ

జగిత్యాల అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కోర్టు నుంచి రిమాండ్ ఖైదీ ఒకరు మంగళవారం కానిస్టేబుల్ కళ్లు కప్పి పరారయ్యాడు. పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన జున్ను ప్రసాద్ అనే గల్ఫ్ ఏజెంట్‌పై పది రోజుల క్రితం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు కాగా జగిత్యాల సబ్ జైలులో ఉన్నాడు. అయితే జున్ను ప్రసాద్‌పై కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో పీటీ వారెంట్ ఉండడంతో కొడిమ్యాల పోలీసులు మంగళవారం జగిత్యాల కోర్టులో ప్రవేశపెట్టారు. అనంతరం కోర్టు కార్యాలయంలో కానిస్టేబుల్ పనిలో ఉండగా అతని కళ్లు కప్పి జున్నుప్రసాద్ తప్పించుకున్నాడు.

ఆర్‌ఎంపీ ఆకస్మిక మృతి

హుజూరాబాద్‌రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన అల్లి శ్రీనివాసు(60) అనే ఆర్‌ఎంపీ మంగళవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. ఛాతీలో నొప్పి రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

దర్గా సమీపంలోని అక్రమ కట్టడం కూల్చివేత

● సందర్శించేందుకు వెళ్లిన బీజేపీ నాయకులు ● అడ్డుకున్న పోలీసులు... బీజేపీ నాయకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని హజ్రత్ సయ్యద్ దర్వేశ్ అలీషా ఖాద్రీ దర్గా సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు మంగళవారం తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలోని అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. దర్గా ప్రాంతంతో పాటు సింగారం గ్రామంలో ప్రజలు గుమికూడరాదని పేర్కొంటూ బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్‌ను విధించారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలోని నాయకులు అక్కడకు చేరుకునేందుకు యత్నించారు. గ్రామస్థులు అడ్డుకుని వాగ్వివాదానికి దిగారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలోని పోలీసు బలగాలు బీజేపీ నాయకులను ఎక్కడికక్కడే అడ్డుకున్నాయి. తమ గ్రామానికి ఎవరైనా బీజేపీ నాయకులు వస్తే చంపుతానంటూ మాజీ ప్రజాప్రతినిధి బెదిరింపులకు దిగారనే సమాచారంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపితో పాటు నాయకులు, కార్యకర్తలు నారాయణపూర్ గ్రామశివారులోకి చేరుకున్నారు. పోలీసులు గోపితోపాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులను అడ్డుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసి సిరిసిల్లకు తరలిస్తున్న క్రమంలో మండలంలోని రాగట్లపల్లి శివారులో బీజేపీ శ్రేణులు పోలీసుల వాహనాలను అడ్డుకున్నాయి. తమ నాయకులను ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని పట్టుబట్టడంతో వారిని రాజాకు తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్పీ మహేశ్‌బి గీతే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సమీక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపితో మాట్లాడిన అనంతరం అరెస్టయిన నాయకులను విడుదల చేశారు. కాగా మాజీ ప్రజాప్రతినిధి బెదిరింపులకు పాల్పడడంపై కిష్టునాయక్‌తండాకు చెందిన బీజేపీ ఎస్టీ సెల్ నాయకుడు ధరావత్ రవీందర్‌నాయక్ ఫిర్యాదు చేశారు.


అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కావేటర్


బీజేపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

తాటిపల్లిలో ఇంటిపై పిడుగు

● వినికిడి కోల్పోయిన మహిళ.. చేతికి బొబ్బలు


పిడుగుపాటుకు ధ్వంసమైన ఇంటి గోడ

మల్యాల, మే 27(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని తాటిపల్లిలో మంగళవారం మధ్యాహ్నం ఓ ఇంటిపై పిడుగు పడింది. ఇంట్లో ఉన్న మహిళ వినికిడి కోల్పోగా చేతికి గాయాలు అయ్యాయి. తాటిపల్లికి చెందిన జేరిపోతుల సుమలత, కూతురు, కుమారుడితో ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం వర్షం కురువగా సుమలత ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంట్లోని పైకప్పు పెచ్చులు ఊడిపోవడంతో పాటు సుమలత చేతికి బొబ్బలు రావడంతో గాయాలయ్యాయి. అలాగే పిడుగుపాటు కు భారీ శబ్దం రావడంతో సుమలత వినికిడి శక్తి కోల్పోయింది. వెంటనే స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇంట్లోనే ఉన్న వారి కూతురు, కుమారుడు క్షేమంగా ఉన్నారు. విద్యుత్ పరికరాలు, ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎస్సై నరేశ్‌కుమార్ ఇంటిని పరిశీలించారు.

ఇదిలా ఉంటే పిడుగు పడే సమయంలో కొందరు సెల్‌ఫోన్‌లో పిడుగు పాటు దృశ్యాలు బంధించగా అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.


పిడుగుపాటుతో గాయపడిన సుమలత

టిఫిన్ సెంటర్‌లో ఫుడ్ పాయిజన్ : ఐదుగురికి అస్వస్థత


జగిత్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ


చికిత్స పొందుతున్న బాలుడు

జగిత్యాల అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో ఓ టిఫిన్ సెంటర్‌లో ఫుడ్ పాయిజన్ కావడంతో రెండు రోజుల వ్యవధిలో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం బుగ్గారం మండలానికి చెందిన ఓ వ్యక్తి తన భార్య పిల్లలతో కలిసి జగిత్యాల పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేశాడు. అనంతరం అతడి ఇద్దరు పిల్లలు, భార్య వాంతులు, విరేచనాలతో అనారోగ్యం పాలు కాగా వారిని ఆసుపత్రిలో చేర్చారు. మంగళవారం ఉదయం పట్టణానికి చెందిన ఆకుల శ్రీనివాస్‌గౌడ్ ఉదయం తన ఇంటికి టిఫిన్ తీసుకెళ్లగా అది తిన్న అతడి కుమారుడు రిషిరాజ్ అస్వస్థతకు గురికావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. టిఫిన్ తిన్న తర్వాతే ఇలా జరిగిందని బాధితులు పేర్కొంటున్నారు. ఎలాంటి శుభ్రత లేకుండా టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేలా చూడాలన్నారు.

రెండు ఇళ్లలో చోరీ


పరిశీలిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని భూంనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో సోమవారం రాత్రి రెండు ఫ్లాట్లలో చోరీ జరిగింది. మూడో ఫ్లోర్‌లో ఉంటున్న గండు సదయ్య, నాల్గవ ఫ్లోర్లో ఉంటున్న మాదాసి సందీప్‌లు తోడళ్లుళ్లు. సందీప్ దుబాయ్‌లో ఉంటుండగా, సదయ్య తీర్థయాత్రలకు వెళ్లాడు. రెండు ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో దొంగలు తాళాలు పగులగొట్టి ఇండ్లలోకి చొరబడ్డారు. అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఫ్లాట్ నంబర్ 402 సందీప్ ఇంట్లో 58 గ్రాము ల బంగారు ఆభరణాలు, 1260 గ్రాముల వెండి, 30 వేల రూపాయల నగదు, మొత్తం 2 లక్షల 77 వేల రూపాయల విలువ చోరీ జరిగింది. అలాగే ఫ్లాట్ నంబర్ 302 గండు సదయ్య ఇంట్లో 8 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, 10 వేల రూపాయల నగదు మొత్తం 51 వేల రూపాయల విలువ గల దోచుకెళ్ళినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కొట్టె శ్రీవిద్య, గండు అనూషల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించగా స్థానికులను విచారించినట్లు పోలీసులు తెలిపారు.

గంగాధర రైల్వే గేటు వద్ద ప్రమాదకరంగా రోడ్డు

● వాహనదారుల ఇబ్బందులు ● నిత్యం భారీ వాహనాలతో రద్దీ

గంగాధర, మే 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల ప్రధాన రహదారిపై గంగాధర రైల్వేగేట్ వద్ద పెద్ద పెద్ద గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా బీటి రోడ్డు కోతలకు గురై పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్-జగిత్యాల రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు కష్టాలు పడక తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాలకు మరింత గొయ్యిలు ఏర్పడనున్నాయి. కరీంనగర్, నిజామాబాద్ ప్రధాన రహదారి కావడంతో నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు జరిపి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.


గంగాధర రైల్వే గేటు వద్ద దెబ్బతిన్న రోడ్డు



● భూషణరావుపేటలో ఐదెకరాల్లో విస్తరించిన వృక్షం
● పరిసరాల్లో కాళికాదేవి విగ్రహ ప్రతిష్ఠ ● మర్రవ్వ ఆలయంగా ప్రసిద్ధి

మహో మర్రి

కథలాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేట మర్రి చెట్టు ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఐదెకరాల విస్తీర్ణంలో విస్తరించింది. ఈ మర్రి వృక్షానికి దాదాపు 300 ఏళ్ల చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతుంటారు. మర్రి ఉన్న ప్రదేశంలో మొదట ఈ గ్రామం ఏర్పడగా అక్కడ అనేక వ్యాధులు విజృభించి మరణాల సంఖ్య పెరిగి పోతున్న క్రమంలో కాళికాదేవిని ప్రతిష్ఠించి పూజలు చేసినట్టుగా స్థానికులు చెబుతారు. దీంతో వ్యాధులన్నీ నయం కావడంతో కాళికా మాత మహిమ వల్లేనని పూర్వీకుల నమ్మకం. దీంతో ఈ ఆలయం మర్రవ్వ దేవాలయంగా ప్రసిద్ధి పొందింది. కాళీ మాత సన్నిధికి ఏటేటా భక్తుల రాక పెరుగుతోంది. మర్రి ఊడలతో రోజురోజుకూ విస్తరిస్తూ పచ్చదనంతో పర్యాటకులకు నెలవుగా మారుతోంది. భక్తుల కోసం గ్రామస్థులు ప్రతీ సంవత్సరం అభివృద్ధి పనులు చేపడుతూ సౌకర్యాలు కల్పిస్తున్నారు.

వివిధ జిల్లాల నుంచి భక్తుల రాక

భూషణరావుపేటలో బుధ, శుక్రవారాల్లో అమ్మ వారి సన్నిధికి వందలాది మంది భక్తులు వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. జనవరి నుంచి మే దాకా భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం రెండు ధర్మశాలలు, వాటర్ ట్యాంకులు, హైమాస్ట్ లైట్లు, సిమెంట్ రోడ్డు నిర్మాణం వంటి పనులను చేపట్టారు. ఎప్పటికప్పుడు ఎలాంటి చెత్తా, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

పెరిగిన పర్యాటకుల తాకిడి

భారీ వృక్షంగా మారి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్న క్రమంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను ఉపాధ్యాయులు ఇక్కడికి పిక్నిక్ కోసం తీసుకువస్తుంటారు. పచ్చదనంతో అందంగా ఉండడం వల్ల పలువురు లఘు చిత్రాలను చిత్రీకరిస్తుంటారు. మర్రికి ఎప్పుడు ఊడలు కిందికి దిగుతుండగా వాటి రక్షణ కోసం కుండీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో చెట్టు మరింత విస్తరించడానికి అవకాశం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. పర్యాటక స్థలంగా మారినందు వల్ల అమ్మవారి ఆశీస్సుల కోసం మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు వంటి ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల తాకిడి పెరిగింది. మర్రవ్వ దేవాలయం కోరుట్ల నుంచి 13 కి.మీ., వేములవాడ నుంచి 40 కి.మీ. దూరంలో ఉంటుంది.



మర్రవ్వ ఆలయం

చల్లగా చూడమ్మ పోచమ్మ తల్లీ..

● బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు
● ఒడిబియ్యం, నైవేద్యంతో మొక్కులు చెల్లింపు



బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



వేములవాడ కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలను, పాడి పంటలను చల్లగా చూడమ్మ పోచమ్మ తల్లీ... అంటూ భక్తులు వేములవాడ బద్ది పోచమ్మ తల్లీకి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఉదయా న్నే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండకుని డప్పుచప్పుళ్ల, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. భారీగా తరలి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయ ప్రాంగణం, క్యూలైన్ కిక్కిరిసి పోయింది. నెత్తిన బోనాలతో గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి బైండ్ల పూజారులతో పట్నాలు వేసి ఒడిబియ్యం, నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం కళ్లసాకతో పాడి పంటలు, పిల్లాపాపలను చల్లగా ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.


అంజన్న సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తజనం

మల్యాల, మే 27(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేకువ జాము నుంచే వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీ రాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. కాగా జైజంక్షన్, పార్కింగ్ ప్రాంతంలో వాహనాల రాకపోకల అంతరాయంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

తీర్థ యాత్రలకు వెళ్లే వారికి ప్రత్యేక రైళ్లు





పెద్దపల్లిటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14 నుంచి జూలై 13వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్యాకేజీ 1: గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర

ఈ యాత్రలో కాశీ, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగరాజ్, శృంగవర్పూర్, ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు ఉంటుంది. ఒక్కొక్కరికి సాధారణ టికెట్టు ధర రూ.16 వేల 2 వందలు, 3 టైర్ ఏసీ ధర రూ.26 వేల 5 వందలు, 2 టైర్ ఏసీ ధర రూ.35 వేలు ఉంటుందన్నారు. ఈ యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా సాగుతుంది.


ప్యాకేజీ 2: ఐదు జ్యోతిర్లింగాల యాత్ర

ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్ ఉన్నాయి. ఈ యాత్రలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చని వివరించారు. ఈ యాత్ర జూలై 5వ తేదీన ప్రారంభమై 13వ వరకు ఉంటుంది. ఒక్కొక్కరికి సాధారణ టికెట్టు ధర రూ.14వేల 7 వందలు, 3 టైర్ ఏసీ ధర రూ.22 వేల 9 వందలు, 2 టైర్ ఏసీ ధర రూ.29వేల 9 వందలు ఉంటుందని వివరించారు. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్ఖడ్, పూర్ణ మీదుగా వెళ్తుందన్నారు..

సౌకర్యాల ఇలా...

రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం, వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శన స్థలాలు ఉంటాయి. ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్, రైల్వే స్టేషన్ నుంచి ఆలయాలకు ప్రయాణం ఉచితం. ప్రతీ రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతి 70 మందికి ఇద్దరు కో ఆర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకూరుస్తారన్నారు. కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలిపారు. టికెట్ బుక్ చేసుకోవాలనుకునే వారు వివరాలకు 9701360701, 9281030712, 92814995845, 9281030749లలో సంప్రదించాలని తెలిపారు.

'నిశాచరుడి దివాస్వప్నం'కు రజనీశ్రీ సాహిత్య పురస్కారం



కవితా సంపుటి

కరీంనగర్ కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా శాఖ ఏటా అందజేసే రాష్ట్ర స్థాయి రజనీశ్రీ సాహిత్య పురస్కారం-2025కు శ్రీకాకుళం జిల్లా కంచిలికి చెందిన రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి మల్లారెడ్డి మురళీమోహన్ రచించిన 'నిశాచరుడి దివాస్వప్నం' కవితా సంపుటి ఎంపికైనట్లు పురస్కార కమిటీ కన్వీనర్, మహాత్మా జ్యోతీబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ సంయుక్త కార్యదర్శి జీవీ శ్యాం ప్రసాద్‌లాల్, పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుం చి 78 కవిత్వ సంపుటాలు వచ్చాయని, న్యాయ నిర్ణేతల నిర్ణయం మేరకు 'నిశాచరుడి దివాస్వప్నం' కవితా సంపుటి ఎంపికైందని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న కార్యక్రమంలో పురస్కారం, నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.



మల్లారెడ్డి మురళీమోహన్

డిగ్రీ పరీక్షల్లో 18 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్‌ప్రాక్టీస్ చేసిన 18 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, వాణిని కేతన్ డిగ్రీ కళాశాల ఇద్దరు, వాగేశ్వరీ డిగ్రీ కళాశాల ఆరుగురు, శివాని డిగ్రీ కళాశాలలో ఐదుగురు, జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు చొప్పున డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

2డే క్రికెట్ లీగ్ టోర్నీకి వర్షం అంతరాయం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో పలు మైదానాల్లో జరుగుతున్న 2డే క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం అడ్డంకిగా మారింది. మంగళ వారం వర్షం పడడంతో కరీంనగర్, వేములవాడలో మూడు మ్యాచ్‌లను మధ్యలోనే ఆపేశారు. కరీంనగర్ సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల మైదానంలో కరీంనగర్ రూరల్, చొప్పదండి వర్సెస్ మాన కొండూర్, హుస్నాబాద్, హుజూరాబాద్ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన మానకొండూర్, హు స్నాబాద్, హుజూరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 19.4 ఓవ ర్లలో 43 పరుగులు చేసి ఆల్ అవుటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన కరీంనగర్ రూరల్, చొప్పదండి జట్టు 28.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసి డిక్లేర్ చేసింది.

అనంతరం రెండో ఇన్నింగ్ ఆరంభించిన మానకొండూ ర్, హుస్నాబాద్, హుజూరాబాద్ 12 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 12 పరుగులు చేసింది. వర్షం పడడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. రెండో మ్యాచ్ కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ మైదానంలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి వర్సెస్ పెద్దపల్లి, రామగుండం, మంథని జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి జట్టు తొలి ఇన్నిం గ్స్‌లో 40 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పెద్దపల్లి, మంథని, రామగుండం జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 34 పరుగులు చేసింది. మధ్యలో వర్షం పడడంతో మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేశారు. మూడో మ్యాచ్ వేములవాడలో సిరిసిల్ల, వేములవాడ వర్సెస్ కరీంనగర్ రూరల్, చొప్పదండి జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిరిసిల్ల, వేములవాడ జట్టు తొలి ఇన్నింగ్‌లో 36.4 ఓవర్లలో 111 పరుగులు చేసి ఆల్ ఔటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన కరీంనగర్ రూరల్, చొప్ప దండి జట్టు 22.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. మధ్యలో వర్షం పడడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీ ధర్‌రావు, ఉపాధ్యక్షులు మహేందర్ గౌడ్, మనోహర్‌రావు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద

ఎగువ నుంచి 652 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం స్వల్పంగా వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 652 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 12.208 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 7.488 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 652 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 321 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా 2024 జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టు లోకి 292.582 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 287.755 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్‌రావు

చొప్పదండి, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రవేత్తల సూచనలు సలహాలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళ వారం మండలంలోని ఆర్నకొండ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు పంట యాజమాన్యం, ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని, అధిక దిగుబడుల కోసం ఆధునిక పద్ధతులను, మెళకువలను పాటించాలన్నారు. పంటలకు డ్రిప్ ద్వారా సాగు చేస్తే నీరు ఆదా చేసుకోవచ్చని తెలి పారు. ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలను అధికారులు రైతులకు వివ రించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేశ్, చింతకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉషారాణి, విజయ భాస్కర్, వ్యవసాయ అధికారులు ప్రభావతి, వంశీకృష్ణ, వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ, విష్ణువర్ధన్, ఉద్యానశాఖ అధికారి రోహిత్, ఏఈవో రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి

ప్రజా సంఘూ ఐక్యవేదిక నాయకుల డిమాండ్

జగిత్యాల అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న హత్యకాండను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలో ర్యాలీ నిర్వ హించారు. ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలన్నారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలియనీయకుండా వారిని మత మౌఢ్యులుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, పౌరహక్కుల సంఘం నాయకులు పొన్నం రాజమల్లు, పిట్టల నారాయణ, చింత భూమయ్య, గల్ఫ్ బాధిత సంఘం నాయకులు రవిగౌడ్, ప్రమోద్ కుమార్, గాజంగి రాజేశ్ పాల్గొన్నారు.



జగిత్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

హైలెవల్ వంతెనకు మోక్షమెప్పుడో..?



పెద్దవాగు వంతెనపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

కోరుట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కొద్దిపాటి వర్షం కురిస్తేనే కోరుట్ల మండల కల్లూర్ గ్రామ శివారులోని పెద్ద వాగు లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలను అంతరాయం ఏర్పడి వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కల్లూర్ మీదుగా మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ రాయికల్ మండల కేంద్రం వెళ్లేందుకు రహదారిని ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో పెద్ద వాగు ఉప్పొంగడంతో లోలెవల్ వంతెనపై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రెండు సంవత్సరాల క్రితం భారీ వరదలు రావడంతో వంతెన మధ్యలో బుంగ పడింది. దీంతో వర్షాకాలం వచ్చిందంటే వాగు కొంత మేర ప్రవహించినా అధికారులు రాకపోకలను నిలిపి వేస్తున్నారు. దీంతో రాయికల్ వెళ్లే వారు మాదాపూర్ మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కల్లూర్ గ్రామ శివారులో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతోంది. వరదలు వచ్చిన సమయంలో అధికారులు బస్సును మాదాపూర్‌గా మీదుగా పంపి విద్యార్థులను తరలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో హైలెవల్ వంతెన నిర్మాణం కోసం అధికారులు సర్వేను చేసి వదిలి పెట్టారు. ప్రభుత్వం హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వెంకటాద్రి చెరువులోకి మురుగు నీరు..

పట్టించుకోని అధికారులు..



మురికి కాలువ ద్వారా చెరువులోకి వెళుతున్న నీరు

గంబీరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): గంబీరావుపేటలోని వెంకటాద్రి చెరువులోకి మురుగు నీరు వచ్చి చేరుతోంది. వందలాది ఎకరాల పంటలకు సాగు నీరందించే ఈ చెరువు దుస్థితిపై ఆందోళన నెలకొంది. గంబీరావుపేటలో కాకతీయుల కాలంలో సీతారామచంద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి నిత్య అభిషేకాలకు మంచినీటి కోసం వెంకటాద్రి చెరువును తవ్వించారు. అప్పట్లో ఎంత కరువు వచ్చినా తాగునీటికి వెంకటాద్రి చెరువే ప్రధాన ఆధారంగా ఉండేది. అలాంటి చెరువు అధికారుల నిర్లక్ష్యం వల్ల మురుయిగాగా మారుతోంది. గ్రామాల్లోని మురికి కాలువల నుంచి వచ్చే మురుగు నీరు వెంకటాద్రి చెరువులోకి చేరుతోంది. మురికి నీరును వేరే మార్గం గుండా దారి మళ్లించాల్సి ఉండగా, అధికారుల పట్టించుకోవడం లేదు. చెరువునీరు కలుషితం అవుతుండటంతో చెరువుపై ఆధార పడ్డ మత్స్యకార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు పట్టించుకుని మురుగు నీరు చెరువులోకి పోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

కలెక్టర్‌కు విన్నవించాం..: రాచర్ల పార్థసారథిశర్మ, పురోహితుడు



వెంకటాద్రి చెరువు మురికి నీటితో కలుషితమవుతోంది. మంచినీటి చెరువు మురుగు నీటితో దుర్గంధం వెదజల్లుతోంది. దీనిపై ఇటీవల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి పరిస్థితి విన్నవించాం. పూర్వ వైభవం తేవాలని వినతిపత్రం అందజేశాం. గ్రామంలోని వచ్చే మురుగునీరు కాలువల ద్వారా నేరుగా చెరువులోకి వెళుతున్న విషయాన్ని వివరించాం. మంచినీటి వనరుగా పేరున్న ఈ చెరువు రోజురోజుకు మురికి కుంటగా మారుతోందని వినతి పత్రం ద్వార తెలిపాం. చెరువు పరిస్థితి చెప్పడంతో కలెక్టర్ వెంటనే స్పందించారు. చెరువులోకి మురుగు నీరు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



గంభీరావుపేట వెంకటాద్రి చెరువులోకి చేరుతున్న మురుగు నీరు

దివ్యాంగులకు రుణాలు ఇవ్వాలి

కథలాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌యువవికాసం పథకంలో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ అవకాశం ఇవ్వాలని మండల దివ్యాంగుల సంఘం మంగళవారం ఎంపీడీఓ శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నిరుద్యోగ దివ్యాంగులు ఉపాధి పొండానికిగాను దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం రిజర్వేషన్‌కు అవకాశం ఇచ్చి కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండాలని కోరారు. దివ్యాంగుల్లో అర్హులైన వారినే ఎంపిక చేసి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా లంక దాసరి శ్రీనివాస్, దేవదాస్, రవినాయక్, ఓంప్రకాశ్, అస్గర్‌ఖాన్, బోరెరవి తదితరులు ఉన్నారు.

నర్సరీని పరిశీలించిన ప్రత్యేకాధికారి

మెట్‌పల్లిటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేగుంటలో ఏర్పాటు చేసిన నర్సరీని అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి బీఎస్ లత మంగళవారం పరిశీలించారు. డంపింగ్ యార్డులోని బయోమైనింగ్ ద్వారా వచ్చే ఎరువును పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం దృష్ట్య ప్రజలకు ఇచ్చే రకరకాల మొక్కలను అందజేయలని అన్నారు. రోడ్లకు ఇరువైపుల పూల మొక్కలను, అవెన్యూ ప్లాంటేషన్ నాటాలని ఆదేశించినారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ టి మోహన్, ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, ఎమ్మార్వో శ్రీనివాస్, డి ఈ నాగేశ్వరరావు,ఏఈ తిరుపతి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొడిమ్యాలకు ఎమ్మెల్యే రాక

కొడిమ్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడిమ్యాలకు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం బుధవారం వస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందించనున్నట్లు వారు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కొడిమ్యాల, మే 27(ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వచ్చె వ్యాదులపై ప్రజలకు అవగాహన కలిపించాలని జిల్లా ఉప వైద్యాధికారి ఎన్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని నమిళికొండ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్య మందిర్‌లోని రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. అనంతరం మందుల ఎక్స్పైరీ డేట్‌లను పరిశీలించారు. అవసరం మేరకు వచ్చె ప్రతి ఒక్కరికి మందులను అందించాలన్నారు. అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేసుకోకూడదన్నారు. అనంతరం మండలంలోని తురుకకాశీనగర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ ఉదయ్‌కుమార్, ఏఎన్‌ఎం లక్ష్మీకాంత ఉన్నారు.

జిల్లాలో భారీ వర్షం

-కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో గంటన్నర వ్యవధిలో 101 మిల్లీమీటర్ల వర్షం
-జలమయమైన రహదారులు -కుంటలు, చెరువుల్లోకి నీరు


పెగడపల్లిలో చెరువులోకి వచ్చిన వర్షపు నీరు


మేడిపల్లి మండలం కమ్మరిపేటలో ఉధృతంగా పారుతున్న వాగు

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మోస్తారు నుంచి భారీగా వర్షం కురిసింది. రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కొడిమ్యాల మండలం తిరుమలాపూర్‌లో సాయంత్రం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు గంటన్నర వ్యవధిలో 101మి.మీల రికార్డు స్థాయి వర్షం కురిసింది. పెగడపల్లిలో 72.3 మి.మీ, కొడిమ్యాల మండలం పూడూరులో 61.3, కథలాపూర్‌లో 60, మల్యాల మండలం మద్దుట్లలో 52.5, బీమారం మండలం గోవిందారంలో 49, మేడిపల్లిలో 47.3, సారంగపూర్‌లో 44.3, కోరుట్లలో 37.5, బీమారం మండలం మన్నెగూడెంలో 26.5, మల్యాలలో 25.5, ధర్మపురి మండలం నేరేళ్లలో 24.5, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 20.3, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 13, గొల్లపల్లిలో 11.5, మెట్‌పల్లిలో 11.3, జగిత్యాలలో 9.5, మల్లాపూర్‌లో 7.5, వెల్గటూరులో 5.8, ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 4.5, రాయికల్‌లో 1.8, భీమారం, బుగ్గారం మండలం సిరికొండలో 0.8, ఎండపల్లి మండలం గుల్లకోట, మారేడుపల్లిలో 0.5మి.మీల వర్షం కురిసింది. జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో గల సుమారు 500 బస్తాల వరి ధాన్యం తడిచిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా కొన్ని గంటల పాటు ఇళ్లలోంచి ఎవరూ బయటకు రాలేదు.

●**జగిత్యాల అర్బన్:** పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. టవర్, గంజ్, తహసీల్ చౌరస్తా, తులసి నగర్, ప్రాంతంలో వర్షానికి కాలనీలు నీటితో నిండిపోయాయి దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

కూలిన పాఠశాల ప్రహరీ

కథలాపూర్: భారీ వర్షానికి పెగ్గెర్ల ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలిపోయింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. కొద్ది రోజులుగా ఎండవేడితో ఇబ్బంది పడిన జనాలలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. రైతాంగం పొలాల్లో జీలుగ విత్తనాలు చల్లుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

●**కొడిమ్యాల:** మండలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా తిర్మలాపూర్‌లో 101ఎంఎం వర్షపాతం నమోదైంది. మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో సోమిడి అజయ్, లింగయ్య అనే వ్యక్తుల ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దమ్మయ్యపేట గుట్ట ప్రాంతం నుంచి వచ్చిన వర్షపు నీటితో కొడిమ్యాల-కోనాపూర్ గ్రామాల మధ్య ఉన్న బుగ్గవాగు పారిపోతారం చెరువులోకి నీరు చేరింది. మండలంలోని పూడూర్ గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద తాటిచెట్టు విరిగి కిందపడింది.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

పెగడపల్లి: పెగడపల్లి మండలంలో భారీ వర్షానికి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు తడిచి పోయాయి. లారీలు రాక ధాన్యం తూకం వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పెగ్గెర్లలో కూలిన పాఠశాల ప్రహరీ

'స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి'


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు

కోరుట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకులు సిద్దంగా ఉండి సత్తా చాటాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆద్వర్యంలో నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు పాల్గొన్ని కార్యకర్తలకు మార్గదర్శకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పని అయిపోయిందని వారిపై ప్రజలలో పూర్తిగా వ్యతిరేకత పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, మాజీ ఎంపీపీ తోట నారాయణలతో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సింగిల్ విండో చైర్మెన్‌లు పాల్గొన్నారు.

●**ఇబ్రహీంపట్నం, మే 27(ఆంధ్రజ్యోతి):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థుల విజయం కొరకు పార్టీ శ్రేణులు ఇప్పటినుండే సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గుడేటి కాపు సంఘ భవనంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రకభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరత్ రెడ్డి, కముటం భారతి-రమేష్, జాజాల జగనరావు, నేముల లక్ష్మరెడ్డి, జెడి సుమన్ పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

కొడిమ్యాల, మే 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో బాగంగా వానా కాలం సాగుకు సమాయత్తం అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి, పత్తి, అపరాల పంటలైన పెసర, మినుము, కంది పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ అధికారి వి. భాస్కర్, ఏవో పి.జ్యోతి, ఏఈవో శ్రీలత, మాజీ సర్పంచు రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

ధర్మపురి, మే 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ధర్మపురి సీఐ మహేందర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పంచాయతీలకు నిలిచిన నిధులు

(5వ పేజీ తరువాయి)

కొనసాగిస్తుండగా రానున్న రోజుల్లో అది కూడా ప్రశ్నార్థకంగా మారనుంది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యేలా చొరవ చూపి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ భారంగా మారింది

-సంతోష్‌రావు, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి



పంచాయతీల అభివృద్ధికి మా వంతు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో ప్రగతి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాక నిర్వహణ భారంగా మారింది. అప్పులు చేసి పనులు చేయాల్సి వస్తోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

-సీహెచ్ మదన్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి



పంచాయతీలకు నిధులు విడుదల కాని మాట వాస్తవం. నిధులు విడుదల చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు ఖాతాల్లో జమ అవుతాయని ఆశిస్తున్నాం. పంచాయతీల అభివృద్ధికి అందరి సహకారం అవసరం.

'కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యం'

మల్లాపూర్, మే, 27 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమవుతుందని కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం మండలంలోని కుస్థాపూర్, రత్నాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సీఎం సహయనిధి కింద మంజూరైన 40 మంది లబ్ధిదారులకు రూ.14,74000 విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ ఏలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, నాయకులు ఆనంద్‌గౌడ్, పోతు శేఖర్, నానం రాకేష్, మిట్టపల్లి జలపతిరెడ్డి, పుంద్ర శ్రీనివాస్‌రెడ్డి, రవి, రమేష్, నర్సయ్య, శ్రీనివాస్, సురేష్‌లతో పాటు మాజీ సర్పంచులు, పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 6వ వార్డుకు చెందిన కొలగాని గంగ అనే మహిళ వెన్నెముక సమస్యతో బాధపడుతుండగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు మంగళవారం రెండున్నర లక్షల విలువైన ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గంగ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కూతురు రాజేష్, నాయకులు ఒద్ది రాంమోహన్, కత్రోజి గిరి, కోటేశ్వర్ రావు, చిట్ల మనోహర్, శ్రీనివాస్, రవిశంకర్, జంగిలి శశి తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన కల్పించాలి

కొడిమ్యాల, మే 27(ఆంధ్రజ్యోతి) : యోగాపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా ఆఫీస్ డాక్టర్ అర్చన అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. అంతకముందు మండలంలోని పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ అర్చన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు నరేష్, పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, ఎన్‌సీడీ సూపర్‌వైజర్ మురళి, శ్యాం సుందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

-మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశం

జగిత్యాల అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ బృందంతో చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ స్పందనను ఆదేశించారు. జగిత్యాల మున్సిపల్‌లో చెత్త సేకర్ల ఆటోలు సోమవారం డీజిల్ లేక చెత్త సేకరణ జరపలేదనే విషయమై కమిషనర్‌ను ఎమ్మెల్యే వివరణ కోరారు. అనంతరం పట్టణంలోని అనేక కాలనీలలో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని వాటి వల్ల కనీసం అంబులెన్స్ కూడా వెళ్ళే పరిస్థితి లేదన్నారు. అక్రమ నిర్మాణాలపై వార్డు ఆఫీసర్లలను బాధ్యులను చేయాలన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా నిర్మాణాల విషయంలో వార్డు ఆఫీసర్‌ల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. పట్టణంలో ప్రస్తుతం 185 సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకున్న ఆస్తులు గుర్తించామని వాటన్నింటిని వెంటనే రద్దు చేస్తామని కమిషనర్ ఎమ్మెల్యేకు తెలిపారు.

గుండెపోటుతో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మృతి


సునీల్‌కుమార్ (ఫైల్)

ధర్మపురి, మే 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, ప్రముఖ వ్యాపారి అక్కెనపెల్లి సునీల్‌కుమార్(49) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. సునీల్‌కుమార్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అత్యంత సన్నిహితుడు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భార్య కొప్పుల స్నేహలత సునీల్‌కుమార్ భౌతికకాయానికి నివాళులర్పించి మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. సునీల్ కుమార్‌కు భార్య అనిత, కొడుకు సుజిత్, కూతురు సాయిసంతోషి ఉన్నారు. ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, బుగ్గారం, ధర్మపురి మాజీ జడ్పీటీసీలు బాదినేని రాజేందర్, అరుణ, పలువురు బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

కోరుట, మే 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం పట్టంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో సీతారామ్ జిందాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్హులైన మెరిటోరియస్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను కళాశాల కరస్పాండెంగ్ పోతని ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్ నవీన్ కుమారుతక్ల కలిసి అందించారు.

జడ్పీ మాజీ వైస్ చైర్మన్‌కు పితృ వియోగం

భీమారం, మే 27 (ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ వైస్ చైర్మన్‌కు పితృవియోగం కలిగింది. భీమారం మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన వొద్దినేని హరిచరణ్‌రావు తండ్రి సురేందర్‌రావు అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ తదితరులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొడిమ్యాల, మే (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్, డిప్యూటీ రేంజర్ ముషీర్‌అహ్మద్ ప్రజలను కోరారు. మంగళవారం సాయంత్రం వారు వేర్వేరుగా మాట్లాడుతూ నల్లగొండ-వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ గ్రామాల శివారులోని అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. బొల్లోనిచెరువు కొండాపూర్, దమ్మయ్యపేట, కోనాపూర్, సూరంపేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ముగిసిన రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

కోరుట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్దిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు మంగళవారంతో ముగిసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఈనెల 22 నుండి 27 వరకు వివిధ క్యాటగిరీలలో దరఖాస్తులు 1470 మంది చేసుకున్నాట్లు వారిలో 1020 మంది ఇంటర్వ్యూలు హజరు అయినట్లు అయన తెలిపారు. ఇంటర్వ్యూలు వివరాలను ఉన్నత అధికారులకు నివేదించినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

గొల్లపల్లిలో..

●గొల్లపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండలంలో మంగళవారం రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు ముగిసాయి. మండలంలో 2707 దరఖాస్తులు రాగా వాటిని కేటగిరిల వారిగా నాలుగు రోజుల పాటు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా బ్యాంక్ లింకేజ్ దరఖాస్తుదారులు 2520 నాన్ బ్యాంక్ లింకేజ్ దరఖాస్తులు అ87 మంది ఉన్నారు. బ్యాంకుల వారిగా ఎస్‌బిఐ 991, యుబిఐ 801, కెడిసిసి 253, టిజిబి గొల్లపెటి 348, టిజిబి లక్ష్మీపూర్ 127 దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపిడిఓ సామ రాంరెడ్డి తెలిపారు.

పెగడపల్లిలో..

●పెగడపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపిక ఇంటర్వ్యూలు మంగళవారంతో ముగిసాయి. ఈ నెల 22న ఇంటర్వ్యూలు ప్రారంబం కాగా మండలంలోని 23 గ్రామాలకు చెందిన 2091 మంది దరఖాస్తుదారులకు గాను ఐదు రోజులలో 1830 మంది ఇంటర్వ్యూలకు హాజరయినట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్, ఏపీఎం సమత, వివిధ బ్యాంక్ శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

రాయికల్‌లో..

●రాయికల్, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువశక్తి పథకానికి దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు రాయికల్ పట్టణంలో నిర్వహించిన ఇంటర్వ్యూలు విజయవంతంగా ముగిసినట్లు మండల ప్రత్యేకాధికారి, సీఈవో గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, బ్యాంక్ సిబ్బంది లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వివరాలను సేకరించారని అన్నారు. ఇంకా ఎవరైనా మిగిలినవారు ఉంటే బుధవారం ఉదయ 10:30 గంటల నుంచి 5 గంటల వరకు చివరిసారిగా అవకాశం ఇస్తున్నామన్నారు.

అహల్యాబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


చేనేత కార్మిక కుటుంబాన్ని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, మే 27(ఆంధ్రజ్యోతి): రాణి అహల్యాబాయి హోల్కర్ జీవితాన్ని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్ పిలుపునిచ్చారు. స్థానిక గీతావిద్యాలయంలో మహారాణి అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవ ముగింపు కార్యక్రమాన్ని జిల్లా సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు జయంతి సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ పాలనలో సంస్కరణలు, మహిళా సాధికారత కోసం కృషి చేసిన మహానీయురాలు రాణి హోల్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకం లక్ష్మణ్, డాక్టర్ అరుణ, సంఘ గౌరవాధ్యక్షుడు కనికరం లచ్చన్న, కార్యదర్శి సోమిరెడ్డి భూమిరెడ్డి, ఉపాధ్యక్షులు సింహరాజు సూర్య నారాయణ, ఆకుతోట రమణారెడ్డి, ఇల్లెందుల పురుషోత్తం, బొందుకూరి శ్రీనివాస్, భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, అశోకరావు, లక్ష్మణ్‌రావు, తో పాటు విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** అహల్యాబాయి హోల్కర్ కులవృత్తులను చేసుకోవడానికి ప్రోత్సాహకాలను అందించిన గొప్ప వ్యక్తి అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం పేర్కొన్నారు. అహల్యాబాయి జయంత్యుత్సవాలలో బాగంగా మంగళవారం మండల బీజేపీ నాయకులతో కలసి సత్యం పెగడపల్లి ఖమండలంలోని బతికెపల్లిలో చేనేత వస్త్రాలు తయారు చేస్తున్న కుటుంబాలను కలసి వస్త్రాలు తయారు చేస్తున్న విదానాన్ని పరిశీలించారు. రెండు వందల డెబ్బై సంవత్సరాల క్రితమే రాణి అహల్యాబాయి తన ఏలుబడిలో వస్త్ర పరిశ్రమను స్థాపించి చేనేత వృత్తిని ప్రోత్సహించిందన్నారు.

అహల్యాబాయి పాలనను స్ఫూర్తిగా తీసుకుని ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. అందుకే కులవృత్తులను ప్రోత్సహించడానికి విశ్వకర్మ యోజన పథకం, ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇండియా, స్కిల్ ఇండియా ద్వారా పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సత్యం, కమిటీ సభ్యులు సాంబారి కళావతి, దురిశెట్టి మమత, పార్టీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, నాయకులు గంగుల కొమురెల్లి, చింతకింది అనసూయ, గట్టయ్య, అంజన్న, రవీందర్ రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడొద్దు

● మండల వ్యవసాయాధికారి దీపిక

మెట్‌పల్లి రూరల్, మే, 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎరువులు, హానికారక రసాయనాలు మోతాదుకు మించి వాడితే భూసారం దెబ్బతింటోందని మండల వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దపూర్ గ్రామంలోని రైతు ముంగిట్లో కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలోని ఆర్ఏఆర్ఎస్, పొలాస వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ ప్రతి రైతు ఆరు సూత్రాలను పాటించి తమ పంటల దిగుబడి పెంచుకో వాలన్నారు. మోతాదుకు మించి హానికారకమైన రసాయ నాలు, ఎరువులు వినియోగించవద్దని, పంట మార్పిడి సరైన ప్రణాళికతో చేస్తే రైతుకు ఎక్కువ దిగుబడి, తక్కువ ఖర్చు, భూమికి దీర్ఘకాలిక ఆరోగ్యం కలుగుతుందని అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రవేత్తలను తమ సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త వేణురెడ్డి, ఏఈవో నరేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దపూర్‌లోని సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి దీపిక

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

జగిత్యాల అగ్రికల్చర్, మే 27(ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకుప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ నేత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా నా హక్కు, బాలకార్మిక వ్యవస్థఅంతం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే నేటి బాలలే నవ భారత నిర్మాతలుగా తయారు కావాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు గడుస్తున్నా నేటికీ దేశంలో బాలకార్మిక వ్యవస్థ కొనసాగడం విచారకరం అన్నారు. దేశ పురోగాభివృద్ధికి అవరోధంగా నిలిచే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

తిరంగా యాత్ర

ఎండపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ భారత త్రివిధ దళాల సైన్యం పాకిస్తాన్ పెంచి పోషించే ఉగ్ర స్థావరాలను హతం చేసిన సైనికులకు మద్దతుగా మంగళ వారం ఎండపల్లి మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్‌లపై ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. అంబారీపేట నుంచి ప్రారంభించి రాజారాంపల్లిలోని వివేకానంద విగ్రహం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ కొమ్ము రాంబాబు, మండల అధ్యక్షులురావు హన్మంతరావు, గోపినేనిగం గాచలం, పొన్నం నరేష్ ఉన్నారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యం కావాలి

మెట్‌పల్లిటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరు ఏకం కావాలని కార్మిక సంఘం జిల్లా గౌడసంఘం అధ్యక్షులు గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మెట్‌పల్లి గీతపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పూదరి సుదాకర్ గౌడ్‌ను, డైరెక్టర్లను, అడిషనల్ పిపిగా నియమితులైన చెర్లపల్లి ఆనంద్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏపూరి శ్రీనివాస్, మారుతి, ఉత్కం సాయగౌడ్, సాయిరాంగౌడ్, డైరెక్టర్లు ఏను గందుల శ్రీనివాస్ గౌడ్,పోన్నం శ్రీనివాస్, ప్రణయ్, రమేష్,రాజేందర్,పుల్ల చిన్నయ్య చిన్న అంజయ్య గౌడ్ ఉన్నారు.